
సాక్షి ఖమ్మం
సోమవారం : 1 : మే : 2023



'సమ్మర్' సందడి !

వేసవి సెలవుల్లో విద్యార్థులకు పలు అంశాలపై శిక్షణ ఇచ్చేందుకు సమ్మర్ క్యాంపులు నిర్వహిస్తుండగా పలువురు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. 8లో



శరవేగంగా 'సీతారామ' !

పాలేరు రిజర్వాయర్‌కు గోదావరి జలాలను తరలించి ఆయకట్టుకు నీరందించే 'సీతారామ' పనులు వేగంగా సాగుతున్నాయి. 10లో

గరిష్టం / కనిష్టం
31° / 23°

వాతావరణం

జిల్లాలో సోమవారం ఉదయం కొన్ని ప్రాంతాల్లో వర్షం పడే అవకాశం ఉంది. పగటి ఉష్ణోగ్రతలు భారీగా తగ్గుతాయి.

లక్ష్యానికి మించి..

హరితహారానికి నర్సరీల్లో పెరుగుతున్న మొక్కలు

- కొత్తగా మునగ మొక్కలు వేయాలని నిర్ణయం
- జిల్లాలో 32.47లక్షల మొక్కలు నాటాలని లక్ష్యం
- 589 నర్సరీల్లో 46.80లక్షల మొక్కల పెంపకం



రఘునాథపాలెం మండలం మంచుకొండ నర్సరీలో మొక్కలను పరిశీలిస్తున్న డీఆర్డీఓ విద్యాచందన (ఫైల్)

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరితహారం తొమ్మిదో విడత కార్యక్రమానికి పంచాయతీల వారీగా మొక్కలు పెంచుతున్నారు. జిల్లాలో 32.47లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్దేశించుకోగా.. ఈసారి కొత్తగా ప్రతి నర్సరీలో మునగ మొక్కలు పెంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లాలో పచ్చదనంతో పాటు అటవీ శాతాన్ని పెంచేందుకు ఏటా లక్షల సంఖ్యలో మొక్కలు నాటుతున్నారు. ఇందుకోసం 20 మండలాల పరిధిలోని 589 గ్రామ పంచాయతీల్లో నర్సరీలు ఏర్పాటు చేశారు. ఇప్పటివరకు 8 విడతల్లో హరితహారం పూర్తి కాగా.. జూలైలో 9వ విడతకు రంగం సిద్ధం చేస్తున్నారు.

46.80 లక్షల మొక్కలు..

హరితహారంలో నాటేందుకు అవసరమైన మొక్కలను డీఆర్డీఏ ఆధ్వర్యంలో పెంచుతున్నారు. జిల్లాలోని 589 గ్రామ పంచాయతీల్లో ఏర్పాటు చేసిన నర్సరీల్లో కానుగ, వేప, చింత, గుల్‌మోర్, రావి, మర్రి, బాదం, నిమ్మ, దానిమ్మ, జామ, ఖర్జూర, బొప్పాయి, రెయిన్ ట్రీ తదితర 46.80లక్షల మొక్కలు పెంచుతున్నారు. వేసవిలో ఎండను తట్టుకునేలా నర్సరీల్లో షేడ్ నెట్లు ఏర్పాటు చేశారు. ఇక ఎక్కడైనా ఎండ వేడికి మొక్కలు చనిపోతే వాటి స్థానంలో కొత్త మొక్కలను పెంచేలా సిబ్బందికి అధికారులు సూచనలు చేశారు.

కొత్తగా మునగ మొక్కలు..

ఆరోగ్య ప్రదాయినిగా పిలిచే మునగ మొక్కలను నర్సరీల్లో పెంచాలని ప్రభుత్వం ఆదేశించింది. జిల్లాలోని ప్రతి నర్సరీలో 1000 మొక్కలు పెంచాలని సూచించింది. దీంతో జిల్లా వ్యాప్తంగా డీఆర్డీఏ ఆధ్వర్యంలో ఉన్న 589 నర్సరీల్లో 5,89,000 మునగ మొక్కలు పెంచుతున్నారు. 9వ విడత హరితహారంలో ఈ మొక్కలను ప్రత్యేకంగా నాటనున్నారు. నర్సరీల్లో వీటి పెంపకంపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు.

లక్ష్యం.. 32.47 లక్షలు

ప్రభుత్వం ఇప్పటివరకు 8 విడతల హరితహారంలో కోట్ల సంఖ్యలో మొక్కలు నాటించింది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో రోడ్ల వెంట, ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటడంతో జిల్లాలో పచ్చదనం పెరిగింది. 9వ విడత హరితహారంలో జిల్లాలో 32.47 లక్షల మొక్కలు నాటాలని అధికారులు నిర్ణయించారు. ఇందుకోసం డీఆర్డీఏ ఆధ్వర్యంలో 46.80 లక్షల మొక్కలను నర్సరీల్లో పెంచుతుండగా.. అటవీ శాఖ ఆధ్వర్యంలో 3.70 లక్షల మొక్కలు పెంచుతున్నారు.

మొక్కలు సిద్ధంగా ఉన్నాయి



వచ్చే హరితహారానికి అవసరమైన మొక్కలను పంచాయతీ నర్సరీల్లో పెంచుతున్నాం. ప్రభుత్వ సూచనలు, కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి నర్సరీలో ఈ ఏడాది మునగ మొక్కలు పెంచుతున్నాం. ఎండల నుంచి రక్షణ కల్పించేందుకు నర్సరీల్లో షేడ్ నెట్‌లు ఏర్పాటు చేయించాం. మొక్కలు చనిపోకుండా ఉదయం, సాయంత్రం నీళ్లు పోయిస్తున్నాం.

– ఎం.విద్యాచందన, డీఆర్డీఓ

శాఖల వారీగా నాటనున్న మొక్కలు

ప్రభుత్వ శాఖ	మొక్కలు (లక్షల్లో)
అటవీ	7.60
డీఆర్‌డీఏ	10
ఇరిగేషన్	2.47
అగ్రికల్చర్	7.70
హార్టీ, సెరికల్చర్	1.80
ఎస్‌సీసీఎల్	1.32
ఎక్సైజ్	0.60
మున్సిపల్	4.70
ఎడ్యుకేషన్	0.30
ఇండస్ట్రీస్	0.30
మైన్స్ అండ్ జియాలజీ	0.60

ఖాళీ భూములు.. కాల్వకట్టల వెంట

- నీటిపారుదల శాఖ హరితహారానికి రంగం సిద్ధం
- జిల్లాలో 1.50లక్షల మొక్కలు నాటేలా ప్రణాళిక



చెరువు కట్టపై మొక్కలు నాటడానికి చేస్తున్న ఏర్పాట్లు

ఖమ్మం అర్బన్ : హరితహారంలో భాగంగా ఈ ఏడాది జలవనరుల శాఖ పరిధిలోని ఖాళీ భూములు, కాల్వకట్టలు, చెరువు కట్టలు, మిగులు భూముల్లో పెద్ద ఎత్తున మొక్కలు నాటేలా ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే జిల్లాలో ఎంత స్థలం ఉంది, ఎన్ని మొక్కలు నాటొచ్చని జలవనరుల శాఖ అధికారులు ప్రాథమికంగా అంచనా వేసి ఉన్నతాధికారులకు పంపించారు. జలవనరుల శాఖతో పాటు డీఆర్‌డీఓ, అదనపు కలెక్టర్, అటవీ శాఖ అధికారుల సమన్వయంతో ఈ ప్రక్రియను విజయవంతం చేసేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది.

అనువైన స్థలాల గుర్తింపు..

జిల్లా వ్యాప్తంగా గుర్తించిన ప్రాంతాల్లో 1.50 లక్షల మొక్కలు నాటేందుకు కసరత్తు చేస్తున్నారు. ఖమ్మం రూరల్, తిరుమలాయపాలెం, కూసుమంచి, నేలకొండపల్లి, ఖమ్మం అర్బన్, రఘునాథపాలెం, వైరా, కొణిజర్ల, ఏన్కూరు, సింగరేణి, కల్లూరు, తల్లాడ, పెనుబల్లి, వేంసూరు, సత్తుపల్లి, మధిర, చింతకాని, బోనకల్, ముదిగొండ, ఎర్రుపాలెం మండలాల్లో మొక్కలు నాటేందుకు భూములు గుర్తించారు. 225 కిలోమీటర్ల కాల్వకట్టల వెంట 91 వేల మొక్కలు, 23 ఎకరాల్లో బ్లాక్ ప్లాంటేషన్‌గా 45 వేల మొక్కలు, స్పాయిల్ బ్యాంక్‌లో 10 ఎకరాల పరిధిలో 12 వేల మొక్కలు నాటేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు.

ఈఎన్‌సీకి ప్రతిపాదనలు పంపాం



జిల్లాలో ఈ ఏడాది నీటిపారుదల శాఖ పరిధిలో భూముల్లో హరితహారంలో మొక్కలు నాటేందుకు ప్రాంతాల వారీగా భూమిని గుర్తించి ప్రతిపాదనలు ఇరిగేషన్ ఈఎన్‌సీకి పంపాం. మొత్తంగా 1.50 లక్షల మొక్కలు నాటేందుకు మండలాల వారీగా లెక్కలు తయారు చేశాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వచ్చే సీజన్‌లో మొక్కలు నాటిస్తాం.

–వెంకట్రాం, జిల్లా నీటిపారుదల శాఖ అధికారి









నూతన సచివాలయంలో తన చాంబర్‌లో ఆశీనులైన మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌కు జిల్లాకు చెందిన పలువురు ప్రజాప్రతినిధులు అభినందనలు తెలిపారు. వారిలో ఎంపీలు నామా నాగేశ్వరరావు, బండి పార్థసారధిరెడ్డి, వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధు, ఎమ్మెల్యేలు వనమా వెంకటేశ్వర రావు, రాములునాయక్, హరిప్రియ, ఖమ్మం, కొత్తగూడెం కలెక్టర్‌లు వి.పి.గౌతమ్, అనుదీప్, అసిస్టెంట్ కలెక్టర్ రాధికా గుప్తా, జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్, మేయర్ పునుకొల్లు నీరజ తదితరులు ఉన్నారు. కాగా, అంతకుముందు మంత్రి అజయ్‌కుమార్ సీఎం కేసీఆర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందించారు. సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య మధురైలో ప్రత్యేకంగా తయారు చేయించిన యాలకుల దండ, శాలువాతో కేసీఆర్‌ను సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

రైతులను మోసం చేసే సర్కారు..

- నష్టపోయిన పంటలకు పరిహారం ఏదీ.?
- వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల
- జిల్లాలో దెబ్బతిన్న పంటల పరిశీలన..



తుమ్మలపల్లిలో రైతులతో మాట్లాడుతున్న షర్మిల

కొణిజర్ల/బోనకల్: 'మాది కిసాన్ సర్కార్ అని సీఎం కేసీఆర్ చెబుతున్నారు.. కానీ ఇది రైతులను మోసం చేసే ప్రభుత్వం.. అకాల వర్షాలతో పంటలు దెబ్బతిన్న రైతులకు ఎకరానికి రూ.10 వేల చొప్పున నష్టపరిహారం అందిస్తామని చెప్పారు.. కానీ నెల దాటినా నేటికీ ఒక్క రూపాయి కూడా ఎవరికీ అందలేదు' అని వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల విమర్శించారు. జిల్లాలోని కొణిజర్ల మండలం తుమ్మలపల్లి, బోనకల్ మండలం లక్ష్మీపురంలో దెబ్బతిన్న పంటలను ఆదివారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అకాల వర్షాలతో రాష్ట్రంలో 9.50లక్షల ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లితే ప్రభుత్వం మాత్రం 2.50 లక్షల ఎకరాల్లోననే మొదట ప్రకటించిందని, ఇప్పుడు 1.50 లక్షలే అని చెబుతుండడం విడ్డూరంగా ఉందన్నారు. వాటికి కూడా పరిహారం ఇవ్వలేదని ఎద్దేవా చేశారు. పంటల బీమా పథకాన్ని కేసీఆర్ ప్రభుత్వం నీరుగార్చిందని ఆరోపించారు. పంట నష్టపోయిన రైతులకు ఇవ్వడానికి డబ్బులు లేవు కానీ వందల కోట్లు ఖర్చు పెట్టి సచివాలయాలు, పెద్ద భవంతులు కట్టుకోవడానికి మాత్రం నిధులు ఉంటాయా అని ప్రశ్నించారు. ఆయా కార్యక్రమాల్లో పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకులు గడిపల్లి కవిత, పిట్టా రామిరెడ్డి, పాసంగులపాటి రాఘవ, ధర్మసోత్ రాంనాయక్, తప్పెట జకరయ్య, మాధవరెడ్డి, నీలం రమేష్, డి.కిశోర్‌కుమార్, వీరారెడ్డి, మర్రి ప్రేమ్‌కుమార్, జ్ఞానేష్, సామినేని రవి, అయిలూరి ఉమామహేష్‌రెడ్డి, దేవబట్ల శ్రీనివాసరెడ్డి, గణపారపు మురళి, షేక్ బాజీ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నో అన్నారు.. ఒక్కటీ అమలు కాలే..

రఘునాథపాలెం/కామేపల్లి(కారేపల్లి): సీఎం కేసీఆర్ ప్రజలకు ఎన్నో పథకాలు అంటూ ప్రచారం చేశారే తప్ప ఏ ఒక్కటీ అమలుకు నోచుకోలేదని షర్మిల అన్నారు. ఈర్లపుడి, మద్దులపల్లి గ్రామాల్లో ఆదివారం ఆమె మాట్లాడుతూ.. పేదలకు అనేక హామీలు ఇచ్చిన కేసీఆర్ మాట నిలుపుకోలేదన్నారు. వైఎస్ కలలు సాకారం చేసేందుకే తాను పార్టీ పెట్టానని చెప్పారు. కాగా, ఆదివారం రాత్రి కూడా షర్మిల అదే గ్రామంలో బస చేశారు. కార్యక్రమంలో నాయకులు సత్తిరెడ్డి, తుంపాల కృష్ణమోహన్, రాములు, బానోత్ మంగీలాల్, భూక్య సుజాత, గ్రామ సర్పంచ్ కేలోత్ దేవ్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

సొమ్మసిల్లిన షర్మిల

తుమ్మలపల్లిలో మొక్కజొన్న చేనులో 10 నిమిషాల పాటు ఎండలో రైతులతో మాట్లాడిన షర్మిల.. ఒక్కసారిగా అస్వస్థతకు గురయ్యారు. సొమ్మసిల్లి కింద పడిపోగా పార్టీ రాష్ట్ర మహిళా కోఆర్డినేటర్ గడిపల్లి కవిత, వ్యక్తిగత భద్రతా సిబ్బంది, స్థానిక మహిళలు సపర్యలు చేయడంతో ఆమె కోలుకుని తిరిగి ప్రసంగం కొనసాగించారు.

న్యూస్‌రీల్

వైఎస్సార్‌టీపీకి లక్కినేని రాజీనామా



మాట్లాడుతున్న లక్కినేని సుధీర్‌బాబు

ఖమ్మంమయూరిసెంటర్: వైఎస్సార్‌టీపీకి రాజీనామా చేస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు లక్కినేని సుధీర్‌బాబు తెలిపారు. ఆదివారం ఖమ్మంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పార్టీలో ఎలాంటి పదవి లేని వ్యక్తి తనను టార్గెట్ చేసి ఇబ్బంది పెడుతున్నాడని ఆరోపించారు. జిల్లాకు ముగ్గురు కో ఆర్డినేటర్లను ప్రకటించి తనను అయోమయానికి గురిచేశారని అన్నారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శులు పెద్దబోయిన శ్రీనివాసరావు, లచ్చిరెడ్డి, ఆలస్యం రవి, మహిళా అధికార ప్రతినిధి యాకలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులకు శిక్షణ



శిక్షణ ఇచ్చేందుకు చెరువులోకి వెళ్తున్న ఏడీ

తిరుమలాయపాలెం: మండలంలోని జల్లేపల్లిలో మత్స్యపారిశ్రామిక సంఘంలో కొత్తగా సభ్యత్వం తీసుకున్న వారికి ఆదివారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లా మత్స్యశాఖ ఏడీ అంజనేయస్వామి చేపలు పట్టడం, వలలు విసిరే విధానలపై సభ్యులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా కోఆపరేటివ్ అధికారి రాంరెడ్డి, ఉపసర్పంచ్ భాషబోయిన వీరన్న, సైదులు, లక్ష్మణ్ పాల్గొన్నారు.

రామయ్యకు సువర్ణ పుష్పార్చన

భద్రాచలం: భద్రాచల శ్రీ సీతారామ చంద్రస్వామి వారి మూలమూర్తులకు ఆదివారం అభిషేకం, సువర్ణ పుష్పార్చన జరిపారు. అనంతరం చిత్రకూట మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. ఆ తర్వాత స్వామివారి నిత్యకల్యాణ వేడుకను అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

ట్రబుల్ హబ్ !



ఖమ్మం జనరల్ ఆస్పత్రిలోని తెలంగాణ డయాగ్నస్టిక్ హబ్

- డయాగ్నస్టిక్ హబ్‌లో తరచూ అవాంతరాలు
- సరిపడా సరఫరాకాని రసాయనాలు
- ఐదు నెలలుగా వాహనాలకు అందని అద్దె
- ల్యాబ్ మేనేజర్ పోస్టు భర్తీ కాక పర్యవేక్షణ కరువు

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలోని డయాగ్నస్టిక్ హబ్‌లో తరచూ అవాంతరాలు తలెత్తుతున్నాయి. పేదలకు ఉచితంగా 57 రకాల పరీక్షలు చేసి నివేదికలు ఇవ్వడంతోపాటు మెరుగైన వైద్యం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ డయాగ్నస్టిక్ సెంటర్లను అందుబాటులోకి తెచ్చింది. ఈ హబ్‌ను ఖమ్మంలో ప్రారంభించి రెండు ఏళ్లు దాటిపోయింది. తొలినాళ్లలో సజావుగానే సాగినా కొన్నాళ్లుగా ఆటంకాలు ఎదురవుతున్నాయి. ఎప్పుడు పరీక్షలు జరుగుతాయో, ఎప్పుడు నిలిచిపోతాయో తెలియని పరిస్థితి నెలకొంది.

ఆగుతూ.. సాగుతూ...

డయాగ్నస్టిక్ హబ్‌కు ఇటీవల బార్‌కోడ్ సరఫరా ఆగింది. ప్రతీ పేషెంట్ నుంచి తీసుకున్న శాంపిళ్లకు బార్‌కోడ్ స్లిప్‌లు అంటించడం ద్వారా ఏ పరీక్ష చేయాలి, అది ఎవరి శాంపిల్ అనేది తెలుస్తుంది. కానీ ఇవి సరఫరా కాకపోవడంతో గత వారం నాలుగు రోజులపాటు పరీక్షలు పూర్తిగా నిలిపివేశారు. దీంతో రోగులు ఇబ్బంది పడ్డారు. తిరిగి హైదరాబాద్ నుంచి బార్‌కోడ్లు వచ్చాకే పరీక్షలు మొదలయ్యాయి. ఇలా ఏదో ఒక కారణంతో ఇక్కడ పరీక్షలకు తరచూ ఇబ్బందులు ఏర్పడుతూనే ఉన్నాయి.

కీలకమైన ల్యాబ్ మేనేజర్ పోస్టు ఖాళీ

హబ్‌లో ఇటీవల ల్యాబ్ మేనేజర్ పోస్టు ఖాళీ కాగా, పర్యవేక్షణ కరువైంది. ల్యాబ్ మేనేజర్ ప్రతీ రోజు పది మంది ల్యాబ్ టెక్నీషియన్ల విధులను పర్యవేక్షిస్తూ, పరీక్షలు, నివేదికలను పరిశీలించాలి. అలాగే, స్టాక్ పరిశీలిస్తూ అవసరమైన రసాయనాలపై నివేదిక పంపిస్తే ఎప్పటికప్పుడు అందుతాయి. కానీ ఇవన్నీ జరగక పరీక్షలకు అంతరాయం ఏర్పడుతోంది. కాగా, ఆస్పత్రిలోని పాథాలజిస్టుకు ఇన్‌చార్జ్ బాధ్యతలు ఇవ్వడంతో ఆయన పరీక్షల నిర్వహణ, రిపోర్టుల తయారీతో పాటు పర్యవేక్షణ బాధ్యతలు నిర్వహించలేకపోతున్నట్లు తెలుస్తోంది.

రూట్ వాహనాల అద్దెకు బ్రేక్..

జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగుల నుంచి సేకరించిన నమూనాలను పెద్దాస్పత్రి ఆవరణలోని డయాగ్నస్టిక్ హబ్‌కు తీసుకొస్తారు. ఆ తర్వాత పరీక్షలు చేసి రోగి సెల్‌కు రిపోర్టు పంపిస్తే వైద్యులకు చూపించుకుని మందులు వాడాల్సి ఉంటుంది. ఇలా శాంపిల్స్ తీసుకొచ్చేందుకు ఐదు రూట్లుగా వాహనాలు అద్దెకు తీసుకున్నారు. ఒక్కో వాహనానికి నెలకు రూ.33 వేల చొప్పున అద్దె చెల్లించాలి. కానీ ఐదు నెలలుగా అద్దె రావడంలేదు. దీంతో ఆయా వాహనాల డ్రైవర్ కమ్ ఓనర్లకు ఇబ్బంది తప్పడంలేదు.

ఇబ్బంది లేకుండా చూస్తున్నాం..



జిల్లా నలుమూలల నుంచి 40 సెంటర్ల ద్వారా శాంపిల్స్ వస్తుండటంతో సాధ్యమైనంత మేరకు ఇబ్బంది లేకుండా పరీక్షలు చేస్తున్నాం. కొన్నిసార్లు రసాయనాల కొరతతో పరీక్షలు నిలిచిపోతున్నాయి. ల్యాబ్ మేనేజర్ పోస్టు ఖాళీగా ఉండటంతో కొంత ఇబ్బంది అవుతోంది. ఆ పోస్ట్ భర్తీ చేస్తే పర్యవేక్షణ సులువవుతుంది. – సందీప్, హబ్ ఇన్‌చార్జ్

అరకొరగా రసాయనాలు

హబ్‌లో క్లినికల్ పాథాలజీ, మైక్రోబయాలజీ, క్లినికల్ బయో కెమిస్ట్రీకి చెందిన 57 రకాల పరీక్షలు నిర్వహిస్తామని మొదట్లో ప్రకటించారు. కానీ తరచూ రసాయనాల సరఫరాలో అంతరాయం కలుగుతుండటం మూలంగా పూర్తి స్థాయిలో టెస్టులు నిర్వహించలేకపోతున్నారు. ఏడాది కాలంగా రసాయనాల సరఫరాలో సమస్యలు ఏర్పడుతున్నాయి. డయాగ్నస్టిక్ హబ్‌లో గంటకు 1,520 టెస్టులు చేసే సామర్థ్యం ఉంది. ఇందులో కెమిస్ట్రీ అనలైజర్ మిషన్ ద్వారా 1,200 పరీక్షలు, ఇమ్యూనో అనలైజర్ మిషన్ ద్వారా 220, సీబీపీ మిషన్ ద్వారా 100 టెస్టులు ఒకేసారి నిర్వహించొచ్చు. కానీ సరిపడా రసాయన సరఫరాలు లేక ఎప్పుడు ఏ పరీక్ష జరుగుతుందో, ఏది ఆగుతుందో తెలియడం లేదు. ప్రస్తుతం ఇక్కడ లిపిడ్ ప్రొఫైల్, యూరిక్ యాసిడ్, టోటల్ ప్రొటీన్, థైరాయిడ్, డెంగీ వంటి తదితర టెస్టులు నిర్వహించట్లేదు. దీంతో చేసేదేం లేక ప్రజలు మళ్లీ ప్రైవేట్ ల్యాబ్‌లను ఆశ్రయిస్తూ ఆర్థికంగా నష్టపోతున్నారు.

'కానిస్టేబుల్' రాత పరీక్ష ప్రశాంతం



పరీక్ష రాసేందుకు ఓ కేంద్రం వద్ద బారులుదీరిన మహిళా అభ్యర్థులు

11,985 మంది అభ్యర్థులు హాజరు

ఖమ్మంక్రైం : పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాల భర్తీకి తుది రాత పరీక్ష ఆదివారం ప్రశాతంగా ముగిసింది. ఖమ్మం నగరంతోపాటు శివారు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన కేంద్రాలలో ఉమ్మడి జిల్లా అభ్యర్థులు పరీక్ష రాశారు. సీపీ విష్ణు ఎస్ వారియర్ సెలవులో వెళ్లడంతో భద్రాద్రి జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ అధ్వర్యంలో పరీక్ష సజావుగా నిర్వహించారు. 21 కేంద్రాల్లో జరిగిన ఈ పరీక్షకు 12,143 మందికిగాను 11,985 మంది హాజరయ్యారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు, అవకతవకలు జరగకుండా అన్ని పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేశారు. బయోమెట్రిక్ హాజరు కోసం అభ్యర్థులను పరీక్ష సమయానికి గంట ముందుగానే కేంద్రాల్లోకి అనుమతించారు. పరీక్ష ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు జరిగింది. దూర ప్రాంతాల అభ్యర్థులు ఉదయం 7 గంటలకే ఖమ్మం చేరుకుని ఆయా కేంద్రాల వద్దకు వెళ్లారు. అభ్యర్థులను కేంద్రాలకు తరలించేందుకు ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేశారు. కేంద్రాల సమీపంలోని జిరాక్స్ సెంటర్లను ముందుగానే మూసివేయించారు. ఎలక్ట్రానిక్ వస్తువులు, సెల్‌ఫోన్‌లు లోనికి అనుమతించలేదు. పరీక్షల నిర్వహణ బందోబస్తుకు ఐదుగురు ఏసీపీలు, 10 మంది సీఐలు, 30 మంది ఎస్‌ఐలు, 105 మంది కానిస్టేబుళ్లు విధులు నిర్వహించారు. ఎస్పీ వినీత్ అధ్వర్యంలో అడిషనల్ డీసీపీలు సుభాష్‌చంద్రబోస్, కుమారస్వామి, ట్రైనీ ఐపీఎస్ అవినాష్ కుమార్ తదితరులు పర్యవేక్షించారు.



అధికారులకు సూచనలు చేస్తున్న భద్రాద్రి ఎస్పీ

కొణిజర్ల : మండలంలోని తనికెళ్ల విజయ ఇంజినీరింగ్ కళాశాలలో ఆదివారం జరిగిన పోలీస్ కానిస్టేబుల్ అర్హత పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. కళాశాలలోని రెండు సెంటర్లలో మొత్తం 960 మంది అభ్యర్థులకు 950 మంది హాజరయ్యారు. భద్రాద్రి జిల్లా ఎస్పీ డాక్టర్ జి వినీత్ కేంద్రాన్ని పరిశీలించగా వైరా ఏసీపీ ఎంఏ రహమాన్ పర్యవేక్షణలో పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహించారు. నిమిషం నిబంధన అమలులో ఉండడంతో అభ్యర్థులు ముందుగానే కేంద్రాలకు చేరుకున్నారు.

అలరించిన 'ఎవ్వనిచే జనించు'



నాటికలోని ఓ సన్నివేశం

ఖమ్మంగాంధీచౌక్: నెలనెలా వెన్నెల కార్యక్రమంలో భాగంగా అన్నాబత్తుల రవీంద్రనాథ్ సాంస్కృతిక కళా సంస్థ(ఆర్క్స్) ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి నగరంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో ప్రదర్శించిన 'ఎవ్వనిచే జనించు' నాటిక అలరించింది. దివాకర్ బాబు రచించిన ఈ నాటికకు వనం పప్పాజి దర్శకత్వం వహించారు. ఈ నాటికలో నర్సింహులుగా చెరుకుపల్లి వెంకటేశ్వరరావు, ఎలమందగా వంగర నీలకంఠేశ్వరరావు, చిన్న నర్సింహులుగా మాస్టర్ చరణ్‌దేవ్, పూజారయ్యగా వనం అప్పాజీ, సోమయాజిగా కొండపల్లి శ్రీనివాస్‌రావు, పైడ్రాజుగా నామా లక్ష్మీనారాయణ, బసవగా ఈశ్వరప్రగడ నలిన్‌కుమార్, లచ్చమ్మగా భవాని నటించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అదనపు కలెక్టర్ ఎన్.మధుసూదన్ మాట్లాడుతూ.. ఖమ్మానికి.. కళలకు ఒక కళా క్షేత్రం ఉండటం, ఆ కళా క్షేత్రాన్ని నిరంతరం మనుగడలో ఉండేలా ప్రోత్సహించటం అభినందనీయమని అన్నారు. ప్రముఖ న్యాయవాది ముదిరెడ్డి నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ.. మరుగున పడుతున్న కళలను ప్రోత్సహిస్తూ కఠోర దీక్షతో నెలనెలా వెన్నెల కార్యక్రమాల్లో భాగంగా నాటికలను ప్రదర్శించటం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో నంది అవార్డు గ్రహీత దేవేంద్ర, శ్రీ చైతన్య విద్యాసంస్థల అధినేత మల్లంపాటి శ్రీధర్, డాక్టర్ పిల్లలమర్రి సుబ్బారావు, కిట్స్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస రావు, ఖమ్మం కళాపరిషత్ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ నాగబత్తిని రవి, వేల్పుల విజేత, నెలనెలా వెన్నెల అధ్యక్ష, కార్యదర్శులు మోటమర్రి జగన్మోహన్‌రావు, ఏఎస్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఐదుగురిపై కేసు

పాల్వంచరూరల్: దంపతుల మధ్య గొడవ ఇరుకుటుంబాల మధ్య ఘర్షణకు దారితీసింది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని సత్యనారాయణపురం గ్రామానికి చెందిన ఆలకుంట స్రవంతికి ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం ఎల్లన్ననగర్‌కు చెందిన గోపాలకృష్ణతో వివాహం జరిగింది. కొంతకాలం వారి కాపురం సజావుగానే సాగింది. కొంతకాలంగా దంపతుల మధ్య మనస్పర్థలు తలెత్తడంతో స్రవంతి రెండు నెలల కిందట పుట్టింటికి వచ్చింది. స్రవంతితో మాట్లాడటానికి అత్త, ఆడబిడ్డ, ఆడబిడ్డ భర్త, మరో ఇద్దరు పెద్దమనుషులు కలిసి ఈ నెల 25వ తేదీన సత్యనారాయణపురం వచ్చారు. మాట్లాడే క్రమంలో మాటామాటా పెరగటంతో స్రవంతి తల్లి ఐలమ్మ, అక్కలు సరోజ, అనూషతో గొడవపడ్డారు. కాగా, తమ అత్తింటివారు దుర్భాషలాడి దాడి చేశారని స్రవంతి ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు తారకమ్మ, దుంప శైలజ, బుచ్చిబాబు, వల్లెపు వెంకటస్వామి, రాంబాబుపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న టిప్పర్



ప్రమాదానికి గురైన ఆర్టీసీ బస్సు

వైరారూరల్: ఆర్టీసీ బస్సును ఎదురుగా వస్తున్న టిప్పర్ అతివేగంగా వచ్చి ఢీకొట్టింది. బస్సుకు ఒక వైపు మాత్రమే తగలడంతో ప్రమాదం తప్పింది. ఈ ఘటన ఆదివారం మండలంలోని స్టేజీపినపాక హైలెవల్ వంతెన వద్ద చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. భద్రాచలం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ప్రయాణికులతో వైరా నుంచి భద్రాచలం వెళ్తోంది. ఎదురుగా వస్తున్న టిప్పర్ అతివేగంతో వచ్చి బస్సుకు ఒక అంచుకు తాకుతూ వెళ్లింది. ఈ ఘటనలో బస్సు కుడి భాగం దెబ్బ తిన్నది. ప్రయాణికులకు ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు.

అనారోగ్యంతో హెడ్‌కానిస్టేబుల్ మృతి



వెంకటేశ్వర్లు (ఫైల్)

రఘునాథపాలెం: రఘునాథపాలెం పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న వాంకుడోతు వెంకటేశ్వర్లు (50) అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో మృతి చెందాడు. వెంకటేశ్వర్లు కొన్ని నెలలుగా కేన్సర్ వ్యాధితో బాధపడుతున్నట్లు పోలీసులు తెలిపారు. కారేపల్లి మండలానికి చెందిన వెంకటేశ్వర్లు నగరంలోని జయనగర్‌కాలనీలో నివాసం ఉంటున్నాడు. వెంకటేశ్వర్లుకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

ట్రాక్టర్ పల్టీ.. డ్రైవర్ మృతి

చర్ల: మండలంలోని దోశిల్లపల్లి గ్రామంలో ట్రాక్టర్ బోల్తా పడగా దాని కింద పడి డ్రైవర్ మృతి చెందిన ఘటన ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. పెద మిడిసిలేరు నుంచి ట్రాక్టర్ దోశిల్లపల్లి మీదుగా చర్లకు వేగంగా వస్తోంది. అయితే దోశిల్లపల్లి గ్రామ శివారులో ఉన్న మూలమలుపు వద్ద ట్రాక్టర్ అదుపుతప్పి రోడ్డుపైనే బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్‌ను నడుపుతున్న పెద మిడిసిలేరుకు చెందిన డ్రైవర్ సప్కా లక్ష్మయ్య (22) ట్రాక్టర్ కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. ట్రాక్టర్‌పై ఉన్న మరో యువకుడు పూనెం అఖిల్‌కు స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న స్థానికులు హుటాహుటిన అక్కడికి చేరుకొని ట్రాక్టర్‌ను తీసే ప్రయత్నం చేసినప్పటికీ అప్పటికే డ్రైవర్ లక్ష్మయ్య మృతి చెందాడు. గాయాలపాలైన పూనెం అఖిల్‌ను వైద్యశాలకు తరలించారు. ఘటనపై సీఐ అశోక్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విప్లవ దృఢ సంకల్పంతో మేడే జరుపుకోవాలి..

చర్ల: అంతర్జాతీయ కార్మిక దినోత్సవమైన మేడేను విప్లవ దృఢ సంకల్పంతో గ్రామాలు, పట్టణాలు, ఫ్యాక్టరీలు, పని ప్రదేశాల్లో జరుపుకోవాలని మావోయిస్టు భద్రాద్రి కొత్తగూడెం అల్లూరి సీతారామరాజు జిల్లాల డివిజన్ కమిటీ కార్యదర్శి ఆజాద్ పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన పత్రికలకు ఒక లేఖను విడుదల చేశారు. సామ్రాజ్యవాదానికి, దళారీ దోపిడీ ప్రభుత్వాలకు వ్యతిరేకంగా, అవిశ్రాంతంగా పోరాడుతున్న విప్లవ కార్మిక వర్గానికి రెడ్ సెల్యూట్ అని పేర్కొన్నారు. నేడు ప్రపంచ సామ్రాజ్యవాదం తీవ్రమైన సంక్షోభం ఎదుర్కొంటోందని, ఈ సంక్షోభం నుంచి బయటపడడానికి ప్రపంచ మార్కెట్ కోసం కొందరు యుద్ధాలను సృష్టించడం, యుద్ధాలు చేయడం, దళారీ ప్రభుత్వాల ద్వారా ప్రపంచ నయా ఆర్థిక విధానాలను అమలు చేయించడం, కార్మిక శ్రమశక్తిని, వెనుకబడిన దేశాల సంపదను దోచుకోవడం లాంటి చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,943

‘సమ్మర్’ సందడి!





సుదిమళ్ల గురుకులంలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు (ఇన్‌సెట్) కొత్తగూడెంలో..

భద్రాద్రి జిల్లాలో కొనసాగుతున్న వేసవి శిబిరాలు

- యోగా, సంగీతం, నృత్యం వంటి కోర్సులపై శిక్షణ
- ఉత్సాహంగా పాల్గొంటున్న విద్యార్థులు
- బోధన తర్వాత సందేశ, వినోదాత్మక కార్యక్రమాలు

కొత్తగూడెంఅర్బన్/ఇల్లెందు: వేసవి సెలవులను విద్యార్థులు సద్వినియోగం చేసుకునేందుకు వీలుగా జిల్లాలోని పలు ప్రాంతాల్లో సమ్మర్ క్యాంపులు ఏర్పాటు చేస్తున్నారు. కొన్ని క్యాంపులు ఉచితంగా నిర్వహిస్తుండగా, మరికొన్నింట్లో కొంత ఫీజు వసూలు చేస్తున్నారు. కొత్తగూడెం జిల్లా కేంద్రంలో ఈనెల 1 నుంచి యోగా, గాత్ర సంగీతం, నృత్య శిక్షణ వంటి శిబిరాల నిర్వహణకు సన్నద్ధమవుతున్నారు. ఇప్పటికే రామవరంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల(పాల్వంచ)లో ‘వాయిస్ ఫర్ గర్ల్స్’ అనే క్యాంప్ నిర్వహిస్తుండగా రాష్ట్రంలోని 17 ఏకలవ్య పాఠశాలల నుంచి 398 మంది విద్యార్థులు హాజరై శిక్షణ పొందుతున్నారు. విద్యార్థినులకు కౌమారదశలో వచ్చే మార్పులు, ఆరోగ్య సూత్రాలు, యుక్తవయసులో నడవడిక, ప్రాథమిక హక్కులు, హింస, భౌతిక దాడులు జరిగితే తీసుకోవాల్సిన జాగ్రత్తలు వంటి వాటిలో శిక్షణ ఇస్తున్నారు.

ఇల్లెందులో ఈనెల 6 వరకు..

ఐటీడీఏ పరిధిలోని సుదిమళ్ల గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో ‘సమ్మర్ సమురాయ్’ కార్యక్రమం సాగుతోంది. 15 రోజుల పాటు సాగే ఈ శిబిరంలో విద్యార్థులకు ఇంగ్లిష్‌లో బేసిక్స్ నేర్పుతున్నారు. సైన్స్ ప్రయోగాలు, జీవన నైపుణ్యాలను మెరుగు పర్చుకోవడం, డ్రోన్ తయారీ, పని విధానంపై ప్రత్యేకంగా బోధిస్తున్నారు. గిరిజన, సాంఘిక సంక్షేమ శాఖ పాఠశాలలతో పాటు, ఏకలవ్య మోడల్ రెసిడెన్సియల్ స్కూళ్లకు చెందిన 200 మంది బాలికలకు ఇక్కడ శిక్షణ ఇస్తున్నారు. గత నెల 22న ప్రారంభమైన ప్రత్యేక శిక్షణ మే 6తో ముగియనుంది. ఒక్కో విద్యార్థినికి రోజుకు రూ. 52తో ప్రత్యేక మెనూ అమలు చేస్తున్నారు. జిల్లాలోని సుదిమళ్ల, అన్నపురెడ్డిపల్లి, ములకలలపల్లి, దమ్మపేట, కొత్తగూడెం, మణుగూరు, పాల్వంచతో పాటు ఖమ్మంలోని పాఠశాలల నుంచి 200 మంది ఇక్కడ మెళకువలు నేర్చుకుంటున్నారు. తరగతుల అనంతరం సందేశాత్మక, వినోదాత్మక కార్యక్రమాలు కూడా ప్రదర్శిస్తున్నారు.

విద్యార్థులకు అవగాహన వస్తుంది



విద్యార్థుల భవిష్యత్ కోసం సూచనలు చేయడం ఎంతో ఆనందంగా ఉంది. ఇలాంటి క్యాంపుల ద్వారా విద్యార్థులు తమ హక్కులు, భవిష్యత్‌లో ఎలా ఉండాలనే అంశాలపై అవగాహన వస్తుంది. పదో తరగతి, ఇంటర్ వంటి కీలక దశల్లో మనసు ఇతర అంశాలపైకి వెళ్లకుండా, ఉత్తమ పౌరులుగా తయారయ్యేందుకు ఈ శిక్షణ ఉపయోగపడుతుంది.

– జి.మానసి, ట్రైనర్, కొత్తగూడెం

ఎన్నో అంశాలు నేర్చుకుంటున్నాం



వేసవి శిక్షణ శిబిరంలో మాకు తెలియని ఎన్నో అంశాలు నేర్చుకుంటున్నాం. సెలవుల్లో ఈ శిక్షణ పొందడం ఎంతో ఆనందంగా ఉంది. భవిష్యత్‌లో ఎలా ఉండాలి, లక్ష్యాన్ని సాధించాలంటే ఏం చేయాలనే విషయాలను ట్రైనర్లు బాగా వివరిస్తున్నారు.

– ఎం.మీనాక్షి, కొత్తగూడెం

మెళకువలు తెలుస్తున్నాయి



సుదిమళ్ల బాలికల గురుకులంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ కార్యక్రమాలు బాగున్నాయి. సెలవుల్లో సమయం వృథా చేయకుండా మెళకువలు తెలుసుకునే అవకాశం లభించింది.

– పూజిత, అన్నపురెడ్డిపల్లి

ఈదురుగాలులు, అకాల వర్షాలు

- రైతులను వెంటాడుతున్న ప్రకృతి వైపరీత్యాలు
- యాసంగి పంటలను నష్టపరుస్తున్న వానలు



ఖమ్మంవ్యవసాయం: ఈదురుగాలులు, అకాల వర్షాలు రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. కొద్ది రోజులుగా అకాల వర్షాలు పంటలను ఆగమాగం చేస్తున్నాయి. ఆదివారం సాయంత్రం 4 గంటల సమయంలో జిల్లాలోని పలుచోట్ల ఈదురు గాలులు, అకాల వర్షం కురిసింది. ఖమ్మం నగరంతో పాటు పరిసర ప్రాంతాలు, మధిర, పాలేరు, వైరా వ్యవసాయ డివిజన్లలో అక్కడక్కడా ఈదురు గాలులు, వర్షం కురిసింది. పలుచోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన అకాల వర్షం కురిసింది. యాసంగి పంటలు చేతికందుతున్న సమయంలో అకాల వర్షాలు రైతులను తీవ్ర ఇబ్బందులకు, నష్టాలకు గురి చేస్తున్నాయి. మార్చి మూడో వారం నుంచి అకాల వర్షాలు వెంటాడుతూనే ఉన్నాయి. మార్చి 17 నుంచి 21 వరకు, ఆ తరువాత మార్చి 31వ తేదీన, ఏప్రిల్‌లో 21, 23, 30 తేదీల్లో ఈదురు గాలులు, అకాల వర్షాలు, వడగళ్ల వానలు కురిశాయి. ఈ ప్రకృతి వైపరీత్యాలతో జిల్లాలో ప్రధానంగా సాగు చేసిన వరి, మొక్కజొన్న, పెసర, మామిడి వంటి పంటలకు నష్టంవాటిల్లింది. గాలిలోని అనిశ్చితి, ద్రోణి కారణంగా ఈ అకాల వర్షాలు కురుస్తున్నట్లు వాతావరణ శాఖ పేర్కొంటోంది. జిల్లాలోని జలాశయాల్లో నీరు సమృద్ధిగా ఉండటంతో ప్రస్తుత యాసంగి సీజన్‌లో జిల్లాలో 3,15,375 ఎకరాల్లో పంటలు సాగు చేయగా, వాటిలో ప్రధానంగా వరి 2,14,868 ఎకరాల్లో, మొక్కజొన్న 91,225 ఎకరాల్లో, పెసర 3,463 ఎకరాల్లో సాగు చేశారు. జిల్లాలో దాదాపు 30 వేల ఎకరాల్లో మామిడి పంట సాగులో ఉంది. ముందుగా సాగు చేసిన వరి, మొక్కజొన్న పంటల కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. యంత్రాలతో, కూలీలతో కోయించిన పంటను రైతులు కల్లాల్లో ఆరబెడుతున్నారు. వరి పంటను ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో విక్రయానికి రాశులుగా పోసి ఉంచారు. ఇక మొక్కజొన్న రైతుల పరిస్థితి మరీ దయనీయంగా ఉంది. ఈదురుగాలులకు కంకితో ఉన్న మొక్కజొన్న పైరు నేలకు వాలింది. దీంతో ఆ పంటను కోయటం ఇబ్బందికరంగా ఉంది. నేలవాలిన మొక్కజొన్న కంకి ఫంగస్ సోకి దెబ్బతింటోంది. దీంతో రైతులు పంటను దక్కించుకోవటం కోసం ఇబ్బందులు పడటంతో పాటు నష్టాలను కూడా చవిచూస్తున్నారు. పండ్ల తోటలకు కూడా నష్టం కలుగుతోంది. ప్రధానంగా మామిడి పంట కోతలు కూడా సాగుతున్నాయి. ఈదురుగాలులు, వడగళ్ల వానలకు మామిడి కాయ రాలిపోయి దెబ్బతింటోంది. అక్కడక్కడా సాగులో ఉన్న బొప్పాయి తోటలు కూడా దెబ్బతింటున్నాయి. ఇప్పటికే జిల్లాలో దాదాపు 40 వేల ఎకరాల్లో పంటలకునష్టం వాటిల్లినట్లు వ్యవసాయ, ఉద్యాన శాఖలు ప్రాథమికంగా గుర్తించాయి. ప్రభుత్వం పంట నష్టాలపై శాస్త్రీయంగా సర్వేలు నిర్వహించి నివేదికలు అందించాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ క్రమంలో క్షేత్ర స్థాయిలో వ్యవసాయ, ఉద్యాన శాఖలు సర్వేలు సాగిస్తున్నాయి. ప్రస్తుతం కొనసాగుతున్న ప్రకృతి వైపరీత్యాలపై కూడా ప్రభుత్వ శాఖలు పంట నష్టాల సర్వేలను నిర్వహిస్తున్నాయి. సమగ్ర నివేదికలు ప్రభుత్వానికి సమర్పిస్తే ఆయా పంటలకు నష్ట పరిహారం అందే అవకాశం ఉంది. ఇక కల్లాల్లో, కొనుగోలు కేంద్రాల్లో అకాల వర్షాలు, ఈదురుగాలుల నుంచి పంటలను రక్షించుకోవటం కోసం రైతులు పడరాని పాట్లు పడుతున్నారు.

కిన్నెరసానిలో జలవిహారం

పాల్వంచరూరల్: కిన్నెరసాని పర్యాటక ప్రాంతంలో ఆదివారం సందడి నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పర్యాటకులు డీర్‌పార్కులోని దుప్పులలను వీక్షించారు. అనంతరం రిజర్వాయర్‌లో జలవిహారం చేశారు. ప్రవేశ రుసుం ద్వారా 580 మంది నుంచి వైల్డ్‌లైఫ్‌కు 20,305 రూపాయలు, 350 మంది బోటింగ్ చేయడం ద్వారా రూ.17,940 టూరిజం శాఖకు ఆదాయం లభించినట్లు నిర్వాహకులు తెలిపారు.



బోటు షికారు చేస్తున్న పర్యాటకులు

కబడ్డీ విజేతలు విజయవాడ, శ్రీకాకుళం



విజేతలకు బహుమతి అందిస్తున్న ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి

నేలకొండపల్లి: మండలంలోని మోటాపురం శ్రీ వీరన్నస్వామి జాతర సందర్భంగా తెలుగు రాష్ట్రాల స్థాయి మహిళా కబడ్డీ పోటీలను నిర్వహించారు. మూడు రోజుల పాటు హోరాహోరీగా సాగిన పోటీలు ఆదివారం ముగిశాయి. ఫైనల్‌లో ఏపీలోని విజయవాడ, శ్రీకాకుళం జిల్లాలకు చెందిన జట్లు తలపడ్డాయి. అనుకోకుండా వర్షం పడటంతో ఫైనల్ పోటీని నిలిపివేశారు. రెండు జట్ల క్రీడాకారులతో చర్చించి మొదటి, రెండో బహుమతులను సమానంగా పంచుకునే విధంగా ఒప్పించారు. దీంతో నిర్వాహకులు విజయవాడ, శ్రీకాకుళం జట్లను సంయుక్త విజేతలుగా ప్రకటించారు. వారికి పాలేరు ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి చేతుల మీదుగా బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు.. గ్రామీణ ప్రాంతాల్లో కబడ్డీ క్రీడను ప్రోత్సహించేందుకు నిర్వాహకులు చేసిన కృషి అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు రాంబాయి, దండా పుల్లయ్య, దేవాలయ కమిటీ ప్రతినిధులు, ప్రజా ప్రతినిధులు, బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి

చింతకాని: ద్విచక్రవాహనం ఢీకొని పోచారపు పాండు (65) మృతిచెందిన ఘటన మండలంలోని పాతర్లపాడు గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. చికెన్ తెచ్చుకునేందుకు దుకాణం వద్దకు వెళ్తుండగా పాండును వెనుక నుంచి వచ్చిన ద్విచక్ర వాహనం ఢీకొట్టడంతో తలకు తీవ్ర గాయమైంది. చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి కుమార్తె తుమ్మ దుర్గ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ పాదిల వెంకన్న కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

సోషల్ మీడియాలో యువతి ఫోన్ కాల్..

రూ. 94,500 పోగొట్టుకున్న యువకుడు



చింతకాని: సోషల్ మీడియా ద్వారా యువతులు చేసే ఆకర్షిత ఫోన్ కాల్‌తో ఓ యువకుడు పెద్ద మొత్తంలో నగదు కోల్పోయిన ఘటన చింతకాని మండలంలో వెలుగుచూసింది. మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువకుడు 15 ఏళ్లుగా ఖమ్మంలో ఉంటూ ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల 26న గుర్తుతెలియని ఓ యువతి ఫేస్‌బుక్ ద్వారా ఆ యువకుడి వివరాలతో పాటు ఫోన్ నంబర్ తీసుకుని సాధారణ ఫోన్ కాల్ చేసింది. ‘ఫేస్‌బుక్‌లో మీ ప్రొఫైల్ ఫొటో చూశాను.. మీరు చాలా అందంగా ఉన్నారు. మిమ్మల్ని చూడాలనిపిస్తోంది.. ఒకసారి వాట్సాప్ వీడియో కాల్ చేస్తా’ అని చెప్పింది. దీంతో ఆ యువకుడు ‘మీరు ఎవరో నాకు తెలియదు.. తెలియని వారితో నేను మాట్లాడను, వీడియో కాల్ చేయొద్ద’ని చెప్పి ఫోన్ కట్ చేశాడు. గంట తర్వాత మరో నంబర్ నుంచి వీడియో కాల్ రావడంతో అతడు ఫోన్ లిఫ్ట్ చేయగా.. ఆ యువతి నగ్నంగా కనిపించటంతో ఫోన్ కట్ చేశాడు. ఇలా రెండు, మూడు సార్లు చేసినపుడు మాట్లాడడంతో వీడియోను రికార్డ్ చేసింది. తర్వాత సదరు యువకుడికి సాధారణ కాల్ చేసి వీడియోను ఫేస్‌బుక్, ట్విట్టర్, యూట్యూబ్‌లలో అప్‌లోడ్ చేస్తానని బ్లాక్ మెయిల్ చేస్తూ రూ.1,50,800 ఇవ్వాలని డిమాండ్ చేసింది. డబ్బు చెల్లించేందుకు నిరాకరించిన యువకుడు ఫోన్ కట్ చేయగా, తెల్లవారి మరో వ్యక్తి ఫోన్ చేసి ‘ఏసీపీ శ్రీధర్‌ను మాట్లాడుతున్నా.. ఓ యువతికి సంబంధించిన వీడియోను సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేసినందుకు నీపై కేసు నమోదైంది.. ఆమెతో మాట్లాడి వీడియో డిలీట్ చేయించుకో.. లేదంటే అరెస్ట్ చేస్తాం.. పదేళ్ల జైలు శిక్ష పడుతుంది’ అని బెదిరించాడు. ఆ తర్వాత ఏసీపీనంటూ మాట్లాడిన వ్యక్తి యువకుడికి వాట్సాప్ వీడియో కాల్ చేయగా అతను పోలీస్ యూనిఫాంలో ఉండటంతో నిజంగా పోలీసు అధికారే చేశాడని భయపడ్డాడు. తర్వాత సోషల్ మీడియా నుంచి కాల్ చేస్తున్నామని చెప్పి మరో వ్యక్తి యువకుడికి ఫోన్ చేసి సోషల్ మీడియాలో మీరు వీడియో అప్‌లోడ్ చేశారని, దానిని డిలీట్ చేయాలంటే రూ.200 సర్వీస్ చార్జీతో కలిపి మొత్తం రూ.1.51 లక్షలు చెల్లించాలని చెప్పాడు. వీరి ఫోన్ కాల్స్‌కు భయపడిన యువకుడు రూ.31,500 చొప్పున మూడు విడతల్లో మొత్తం రూ.94,500 వారు సూచించిన బ్యాంక్ ఖాతాకు ఫోన్ పే ద్వారా పంపించాడు. అనంతరం తనను వాట్సాప్ వీడియో కాల్ ద్వారా మోసం చేశారని గ్రహించి ఫిర్యాదు చేసేందుకు ఖమ్మంలోని సీపీ కార్యాలయానికి వెళ్లగా, అక్కడి పోలీసుల సూచన మేరకు 28న ఆన్‌లైన్ ద్వారా సైబర్ క్రైమ్ బ్రాంచ్‌కు ఫిర్యాదు చేశాడు. అయితే అక్కడి పోలీసులు ఆ డబ్బులు ఇక తిరిగి రావని, ఇప్పటికైనా జాగ్రత్తగా ఉండమని చెప్పి పంపించారని బాధితుడు వాపోయాడు.

బస్సును ఢీకొట్టిన లారీ..

- అతివేగంగా వచ్చి ఢీకొట్టడంతో రెండు పల్టీలు కొట్టిన ఆర్టీసీ బస్సు
- తొమ్మిది మందికి తీవ్ర గాయాలు.. 13 మందికి స్వల్పగాయాలు



ప్రమాద స్థలంలో క్షతగాత్రులు




క్షతగాత్రులతో నిండిపోయిన ఆస్పత్రి


సింగరేణి(కొత్తగూడెం) / కొత్తగూడెంటౌన్: భద్రాచలం నుంచి 51 మంది ప్రయాణికులతో బస్సు గుంటూరు వెళ్తోంది. రుద్రంపూర్ కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్ (ఆర్‌సీహెచ్‌పీ) మూలమలుపు వద్దకు రాగానే.. బొగ్గును అన్‌లోడ్ చేసి అత్యంత వేగంగా వచ్చిన లారీ ఢీకొట్టింది. ఆదివారం తెల్లవారుజామున జరిగిన ఈ ప్రమాదంలో బస్సు రెండు పల్టీలు కొట్టగా 22 మంది ప్రయాణికులు గాయపడ్డారు. అందులో తొమ్మిది మందికి తీవ్రంగా గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి.. భద్రాచలం నుంచి గుంటూరు బయలుదేరిన ఆర్టీసీ బస్సు కొత్తగూడెం దాటి రుద్రంపూర్ వద్దకు రాగానే ప్రమాదానికి గురైంది. ఆర్‌సీహెచ్‌పీలో బొగ్గును అన్‌లోడ్ చేసిన లారీ.. అతివేగంగా వచ్చి బస్సును ఢీకొట్టింది. అకస్మాత్తుగా జరిగిన ఈ ఘటనతో బస్సులో ఉన్నవారు ఒక్కసారిగా ఆర్తనాదాలు చేశారు. బస్సు రెండు పల్టీలు కొట్టడంతో బస్సు పూర్తిగా దెబ్బతిన్నది. కానీ, ప్రాణనష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. క్షతగాత్రులను సింగరేణి రెస్క్యూ స్టేషన్ సిబ్బంది హుటాహుటిన నాలుగు అంబులెన్స్‌లలో కొత్తగూడెంలోని జిల్లా ప్రధాన ఆస్పత్రికి, సింగరేణి ఆస్పత్రికి తరలించారు. జిల్లా ఆస్పత్రిలో ఎటుచూసిన క్షతగాత్రులతో పరిస్థితి హృదయవిదారకంగా మారింది.

అతివేగమే ప్రమాదానికి కారణం..

లారీ అతివేగంగా రావడమే ఈ ప్రమాదానికి కారణ మని తెలుస్తోంది. ఆర్‌సీహెచ్‌పీలో బొగ్గును డంప్ చేసి అతి సమీపంలో జాతీయ రహదారి ఉన్నందున తక్కువ వేగంతో రావాల్సిన లారీ అత్యంత వేగంతో ఒకేసారి బస్సు మీదికి వచ్చింది. అప్పటికే బస్సు డ్రైవర్, కండక్టర్లు చేయి చూపిస్తున్నప్పటికీ కంట్రోల్ చేయకుండా వచ్చి బస్సును ఢీకొట్టినట్లు ప్రయాణికు లు చెబుతున్నారు. ఈ ప్రాంతంలో మూలమలుపులు ఎక్కువగా ఉండటం.. ఎలాంటి హెచ్చరిక సూచికలు లేకపోవటం కూడా ప్రమాదానికి దోహదపడ్డాయని సమాచారం. కాగా, తీవ్రంగా గాయపడిన వారిలో బానోత్ కౌసల్య, బానోత్ బాబు, దీక్షిత, నిర్మల, పోతుమూరి కరుణ, నారాయణమ్మ, పోలూరి భారతి, సుభాన్‌కుమార్, బొజ్జాల శివలక్ష్మి ఉన్నారు.

ఉరివేసుకుని ఉద్యోగి ఆత్మహత్య






నివాళులర్పిస్తున్న రెవెన్యూ ఉద్యోగులు (ఇన్‌సెట్) విజయ్‌కుమార్ (ఫైల్)

తిరుమలాయపాలెం: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న సాలె విజయ్‌కుమార్ (53) శనివారం అర్ధరాత్రి మండలంలోని ఎదుళ్లచెరువు గ్రామంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని ఎదుళ్లచెరువు గ్రామానికి చెందిన సాలె విజయ్‌కుమార్ మండల తహసీల్దార్ కార్యాలయంలో నైట్ వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. కొన్నేళ్ల కిందట భార్య మంగమ్మ మృతిచెందింది. దీంతో పాటు రోడ్డు ప్రమాదంలో విజయ్‌కుమార్ కాలుకి గాయాలయ్యాయి. కుమారుల వద్ద ఉంటున్న విజయ్‌కుమార్ మానసికంగా కృంగిపోయి శనివారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. కుటుంబ సభ్యులు విజయ్‌కుమార్ కోసం గాలించారు. ఆదివారం తెల్లవారుజామున గ్రామ పరిధిలోని శ్మశాన వాటిక స్థలంలో వేపచెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డట్లు గుర్తించారు. మృతుడికి కుమారులు వినోద్, ఉమామహేశ్వరరావు ఉన్నారు. వారి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. డిప్యూటీ తహసీల్దార్ నర్సింహారావు, ఆర్‌ఐ వీరయ్య, వీఆర్‌ఏల సంఘం నాయకులు అజీజ్, శ్రీను, విజయ్, నర్సయ్య తదితరులు నివాళులర్పించారు.

వివాహిత ఆత్మహత్య



భర్తతో శ్రావణి (ఫైల్)

చండ్రుగొండ: మండల కేంద్రంలోని అంబేడ్కర్‌నగర్‌కు చెందిన వివాహిత కుక్కముడి శ్రావణి (25) ఆదివారం ఆత్మహత్య చేసుకుంది. కానీ, ఆమెను తన భర్తే చంపి ఆత్మహత్యగా చిత్రీకరించాడని మృతురాలి కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. పోలీసులు, గ్రామస్తుల కథనం ప్రకారం.. అంబేడ్కర్‌నగర్‌కు చెందిన శ్రావణి, దివ్యతేజ్‌కుమార్ నాలుగేళ్ల కిందట ప్రేమ వివాహం చేసుకున్నారు. రెండేళ్లుగా దంపతుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో శ్రావణి ఇంట్లో ఎవరూ లేని సమయంలో గదిలోని ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుందని దివ్యతేజ్‌కుమార్ కుటుంబ సభ్యులు చెబుతున్నారు. కానీ, భర్తే హతమార్చి ఆత్మహత్యగా చిత్రీకరించినట్లు శ్రావణి కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. మృతురాలికి ఇద్దరు పిల్లలున్నారు. మృతురాలి తల్లి రాధ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. జూలూరుపాడు సీఐ వసంత్‌కుమార్, ఎస్‌ఐ విజయలక్ష్మి ఘటనా స్థలాన్ని సందర్శించారు.


వెంచర్లలో గుమికూడిన టీడీపీ నాయకులు

టీడీపీ నేతల వీరంగం

పులివెందుల నియోజకవర్గంలో వెంచర్‌ను దున్నేసిన బీటెక్ రవి, ఆయన అనుచరులు


టీడీపీ నేతలు దున్నిన వెంచర్

చక్రాయపేట: వైఎస్సార్ జిల్లా పులివెందుల నియోజకవర్గం చక్రాయపేట మండలం సురభి గ్రామం నాగలగుట్టపల్లె సినిమా హాల్ సమీపంలో కొందరు వ్యాపారులు వేసిన రియల్ ఎస్టేట్ వెంచర్‌ను టీడీపీకి చెందిన మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి, ఆయన అనుచరులు ఆదివారం ట్రాక్టర్లతో దున్నేశారు. బీటెక్ రవి, సుమారు 200 మంది నాయకులు, కార్యకర్తలు కలిసి వెంచర్ వద్దకు వచ్చి మారణాయుధాలు పట్టుకుని కేకలు వేస్తూ స్థానికులను భయభ్రాంతులకు గురిచేశారు. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... సురభి గ్రామం నాగలగుట్టపల్లె సినిమా హాల్ సమీపంలో గోవిందు రామయ్య అనే వ్యక్తికి చెందిన 1.05 ఎకరాల భూమిని రమణ, సుబ్బయ్య అనే వ్యాపారులు కొను గోలు చేసి రెండు రోజుల కిందట వెంచర్ వేశా రు. దీంతో స్థానిక టీడీపీ నేతలు తాళ్లపల్లె మహేశ్వరరెడ్డి, రామాంజులరెడ్డిలు బీటెక్ రవిని పిలిపించుకుని వెంచర్‌ను ట్రాక్టర్‌తో దున్నేశారు. ఈ సందర్భంగా సుమారు రెండు వందల మంది టీడీపీ కార్యకర్తలు మారణా యుధాలతో బీభత్సం సృష్టించారు. ఈ విష యం తెలుసుకున్న రామయ్య, రమణ, సుబ్బ య్య వెంచర్ వద్దకు వచ్చేసరికి అందరూ వెళ్లిపోయారు. దీంతో వారు చక్రాయపేట పో లీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆర్కే వ్యాలీ, వేంపల్లె, పులివెందుల రూరల్, అర్బన్ సీఐలు గోవిందరెడ్డి, వెంకటేశ్వర్లు, బాలమద్దిలేటి, రాజు, చక్రాయపేట ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు.

ఎస్సీ సబ్‌ప్లాన్ అమలులో.. ఏపీది అగ్రస్థానం

దేశంలోకెల్లా ఇక్కడే ఎస్సీ కుటుంబాలకు అతిపెద్ద సాయం.. కేంద్రం కితాబు

సాక్షి, అమరావతి : ఎస్సీ ఉప ప్రణాళిక అమలుతో పాటు ఎస్సీ కుటుంబాలకు సహాయం చేయడంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అగ్రస్థానంలో నిలిచింది. దేశంలోని మరే ఇతర రాష్ట్రం అమలుచేయని విధంగా ఎస్సీ ఉప ప్రణాళికను గత ఆర్థిక ఏడాది ఏప్రిల్ నుంచి డిసెంబర్ వరకు ఏపీ అమలుచేసినట్లు కేంద్ర గణాంకాలు, కార్యక్రమాలు అమలు మంత్రిత్వ శాఖ నివేదిక వెల్లడించింది. 2022–23 మూడో త్రైమాసికం వరకు (అంటే ఏప్రిల్ నుంచి డిసెంబర్ వరకు) దేశంలోని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో వివిధ పథకాల అమలు పురోగతిపై నివేదికను ఆ శాఖ శనివారం విడుదల చేసింది. ఎస్సీ ఉప ప్రణాళిక ద్వారా ఆ కుటుంబాలకు సాయం అందించడం, రైతుల వ్యవసాయ పంపుసెట్లకు విద్యుత్ కనెక్షన్లు ఇవ్వడం, పట్టణ పేదలకు సాయం అందించడంలోనూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 'చాలామంచి' పనితీరు కనబరించిందని ఆ నివేదిక కితాబిచ్చింది. లక్ష్యాల్లో 90 శాతానికి పైగా అమలుచేసిన రాష్ట్రాలను చాలామంచి పనితీరు కనబరిచినట్లు, 80–90 శాతం మేర అమలుచేసిన రాష్ట్రాలు 'మంచి పనితీరు' కనబరిచినట్లు.. 80 శాతం లోపల అమలుచేసిన రాష్ట్రాల పనితీరు బాగోలేని రాష్ట్రాలుగా నివేదిక వర్గీకరించింది.



ఏపీలో 33.57 లక్షల కుటుంబాలకు సాయం..

ఎస్సీ ఉప ప్రణాళిక కింద దేశంలోని ఆయా రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో గత ఆర్థిక ఏడాది ఏప్రిల్ నుంచి డిసెంబర్ వరకు మొత్తం 34,68,986 ఎస్సీ కుటుంబాలకు సాయం అందించినట్లు ఆ నివేదిక పేర్కొంది. అయితే.. అందులో ఒక్క ఏపీలోనే ఏకంగా 33,57,052 కుటుంబాలకు సహాయం అందించారు. అలాగే, గతంలో కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల మంత్రిత్వ శాఖ ఏప్రిల్ నుంచి సెప్టెంబరు వరకు విడుదల చేసిన నివేదికలో ఆంధ్రప్రదేశ్‌లో ఎస్సీ ఉప ప్రణాళిక ద్వారా 29,10,944 కుటుంబాలకు సాయం అందించగా.. అదే ఇప్పుడు ఏప్రిల్ నుంచి డిసెంబర్ వరకు విడుదల చేసిన నివేదికలో ఆ సంఖ్య 33,57,052కు పెరిగింది. అంటే.. మూడునెలల వ్యవధిలో అదనంగా 4,46,108 ఎస్సీ కుటుంబాలకు సాయం అందించింది. మిగతా మరే ఇతర రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోనూ లక్ష మంది ఎస్సీ కుటుంబాలకు కూడా సహాయం చేయలేదని నివేదిక స్పష్టంచేసింది. ఒక్క కర్ణాటకలో మాత్రమే 22,884 కుటుంబాలకు ఎస్సీ ఉప ప్రణాళిక ద్వారా సాయం అందించగా మిగతా రాష్ట్రాలు అంతకన్నా తక్కువగా వేల, వందల సంఖ్యలోనే సహాయం అందించాయి.

బాధితులు 22 వేల మంది..

కొల్లగొట్టింది రూ. 10 కోట్లు

వెలుగులోకి వస్తున్న చక్రధర్ మోసాలు

సాక్షి, సిటీబ్యూరో: చిన్న మొత్తాలను ఎక్కువ మంది నుంచి సేకరించడం వల్ల ఎవరికీ దొరకకుండా తప్పించుకోవచ్చనే ఉద్దేశంతో పథకం ప్రకారం మోసానికి పాల్పడిన సిద్దిపేటకు ఓ రాజకీయ పార్టీ నాయకుడు గడగోని చక్రధర్ వ్యవహారం తాజాగా వెలుగులోకి వచ్చింది. సుమారు 22 వేల మందిని మోసం చేసి రూ.10 కోట్ల వరకు వసూలు చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.

కాల్ సెంటర్ ఏర్పాటుతో..

- కాల్ సెంటర్ ఏర్పాటు చేసి వివిధ రాష్ట్రాలకు చెందిన టెలీకాలర్స్ ద్వారా డాటా ఎంట్రీ జాబ్ అంటూ దక్షిణాది రాష్ట్రాల్లోని అమాయకులకు ఫోన్లు చేసి, డాటా ఎంట్రీ ప్రాజెక్ట్ ఇస్తామంటూ నమ్మించి డాటా ఎంట్రీ వర్క్‌తో నెలకు రూ. 20 వేల నుంచి రూ. 25 వేలు సులభంగా సంపాదించుకోవచ్చంటూ బాధితులకు వల వేసేవాడు. ఒప్పుకొన్న వారికి ఇంటర్నెట్ నుంచి సేకరించిన ఇమేజ్‌లను పంపించి డాక్యుమెంట్‌గా కన్వర్ట్ చేయాలంటూ టార్గెట్ ఇచ్చేవాడు. పని పూర్తి చేసి పంపిన వాళ్లకు అడ్వాన్స్‌గా 10 శాతం చెల్లిస్తే, క్వాలిటీ చెక్ చేసి మీ బిల్లులు చెల్లిస్తామంటూ ముందుగా 10 శాతం, ఆ తర్వాత కొన్ని పొరపాట్లున్నాయని వాటిని సెట్ చేయాలని అందుకు మరో 10 శాతం చెల్లించాలంటూ మొత్తం 20 శాతం వసూలు చేసేవాడు.


నిందితుడు చక్రధర్

- ఇలా డబ్బులు వసూలు చేసి, వాళ్ల టార్గెట్ 30 నుంచి 45 రోజులు కాగానే ఆ బ్యాచ్‌ను క్లోజ్ చేసేవాడు. ఒక బ్యాచ్‌లో సుమారు 2 వేల మందిని మోసం చేసేవాడు. ఆ బ్యాచ్‌కు వాడిన సిమ్ కార్డులు, వాళ్లకు ఇచ్చిన డాటా ఎంట్రీ ఇమేజ్‌లను మొత్తం ధ్వంసం చేసేవాడు. ఆ తర్వాత కొన్నాళ్లు విరామం ఇచ్చి తిరిగి మరో బ్యాచ్‌ను ప్రారంభించేవాడు. బాధితులు మోసం జరిగిందని తెలుసుకొని ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ అని వచ్చేది. పోయింది రూ. 5 వేలే కదా అనే ఉద్దేశంతో అంతటితో చాలా మంది వదిలేసేవారు. ఈ క్రమంలో ఇటీవల ఇద్దరు బాధితులు తమకు జరిగిన డాటా ఎంట్రీ మోసాలపై ఫిర్యాదు చేశారు. నగర సైబర్ క్రైం పోలీసులు దర్యాప్తు చేపట్టడంతో భారీ మోసం వెలుగులోకి వచ్చింది.

2018లో స్కెచ్..

చక్రధర్ పలు బ్యాంకుల్లో ఏజెంట్‌గా పని చేస్తూ తన బావమరిదితో కలిసి రియల్ ఎస్టేట్ చేసేవాడు. 2018లో అమీర్‌పేటలో ఉన్న తన బంధువు వినోద్‌తో కలిసి కాల్‌సెంటర్ వద్దకు వెళ్లాడు. అక్కడ డాటా ఎంట్రీ అంటూ ఫోన్లు చేస్తున్న విషయాన్ని గుర్తించి.. తానూ ఇలాగే ఓ కాల్‌సెంటర్ ఏర్పాటు చేసి మోసాలు చేయాలని అతని బంధువుతో ఆలోచన చేశాడు. దీంతో 2018లోనే అమీర్‌పేట్‌లో ఒక కాల్‌సెంటర్ ఏర్పాటు చేశారు. 2021లో తన అడ్డాను పంజాగుట్టకు మార్చాడు.

11 బ్యాచ్‌లు..

అనంతపురం నుంచి రూ.వెయ్యికి ఒక సిమ్ కార్డు కొనడం, నిరుద్యోగుల డాటాను వివిధ మార్గాలలో సేకరించి టెలీ కాలర్స్‌కు అప్పగించే వాడు. తెలుగు, ఇంగ్లిష్, హిందీ, తమిళం, మలయాళం, కన్నడం తెలిసిన వారిని కాల్‌సెంటర్ ఉద్యోగులుగా నియమించుకున్నాడు. వీళ్లకు నెలకు రూ. 15 వేల జీతం, ఉచిత భోజనం, వసతి కల్పిస్తూ, మోసాలు ఎక్కువగా చేసేవారికి ఎక్కువగా ఇన్సెంటివ్‌లు ఇచ్చేవాడు. కేవలం రూ. 2500 నుంచి రూ. 5000 వరకు వారి అమాయకత్వం బట్టి మోసం చేసేవాడు. ఇలా 2021 నుంచి 11 దఫాలుగా సుమారు 22 వేల మందిని చక్రధర్ మోసం చేసి రూ. 10 కోట్ల వరకు వసూలు చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ డబ్బుతో బాచుపల్లి ప్రాంతంలో ప్లాట్లు, హైఎండ్ కార్లు కొనుగోలు చేశాడు. దీంతో పాటు సామాజిక సేవ చేస్తున్నట్లుగా రైతులకు, ఇతరులకు చెక్కులు ఇచ్చి ప్రచారం చేసుకునేవాడు.

రాజమహేంద్రవరంలో మరో 'మార్గదర్శి'

- టీడీపీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవానీ కుటుంబీకుల 'జగజ్జనని చిట్‌ఫండ్స్'లో భారీగా అక్రమాలు
- ఆమె మామ ఆదిరెడ్డి అప్పారావు, అతని కుమారుడు అరెస్టు
- 1982 చిట్‌ఫండ్ చట్టాన్ని ఉల్లంఘించి అక్రమాలు
- చందాదారుల సొమ్ము దారిమళ్లింపు

సాక్షి, అమరావతి/సాక్షి, రాజమహేంద్రవరం : మార్గదర్శి తరహాలో మరో భారీ మోసం వెలుగుచూసింది. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో జగజ్జనని చిట్స్ పేరుతో టీడీపీ నేతలు ఆర్థిక నేరానికి పాల్పడిన విషయం బట్టబయలైంది. 1982 చిట్‌ఫండ్స్ చట్టం నిబంధనలు ఉల్లంఘించి, ఇష్టానుసారం డిపాజిట్లు సేకరించి, వాటిని ఇతర వ్యాపారాలకు, వడ్డీలకు మళ్లించి అక్రమాలకు తెరతీసిన విషయం సీఐడీ దర్యాప్తులో నిర్ధారణ అయ్యింది. దీంతో ఆ చిట్‌ఫండ్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్, టీడీపీ నేత, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు-ఏ1, డైరెక్టర్‌గా ఉన్న ఆయన కుమారుడు ఆదిరెడ్డి శ్రీనివాస్-ఏ2 (రాజమహేంద్రవరం సిటీ టీడీపీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవాని భర్త)లను సీఐడీ అధికారులు రాజమహేంద్రవరంలో ఆదివారం అరెస్టుచేశారు. వీరితోపాటు మరో డైరెక్టర్ అయిన ఆదిరెడ్డి అప్పారావు కుమార్తె ఆదిరెడ్డి వెంకట జ్యోత్సలపై ఐపీసీ సెక్షన్లు 420, 409, 120బి, 477 (ఎ) రెడ్‌విత్ 34, రాష్ట్ర డిపాజిట్‌దారుల హక్కుల పరిరక్షణ చట్టం సెక్షన్-5, కేంద్ర చిట్‌ఫండ్ చట్టం-1982 కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. జగజ్జనని చిట్‌ఫండ్స్ అక్రమాలకు పాల్పడుతున్నట్టు సీఐడీ విభాగానికి కొన్నినెలల క్రితమే ఫిర్యాదులొచ్చాయి. అక్రమాలు వాస్తవమేనని నిర్ధారణ కావడంతో చిట్ రిజిస్ట్రార్ ఈ విషయంపై సీఐడీకి ఫిర్యాదు చేశారు. దాంతో సీఐడీ అధికారులు ఈ ఏడాది మార్చిలో జగజ్జనని చిట్‌ఫండ్స్ కార్యాలయాల్లో తనిఖీలు నిర్వహించారు. ఆ తనిఖీల్లో భారీగా ఆర్థిక అక్రమాలు వెలుగుచూశాయి. వీటిపై సంస్థ బ్రాంచి మేనేజర్లు (ఫోర్‌మెన్) సరైన వివరణ కూడా ఇవ్వలేకపోవడంతో సీఐడీ అధికారులు కేసును మరింత లోతుగా విచారించి అవకతవకలను నిర్ధారించారు.


సీఐడీ కార్యాలయం వద్ద టీడీపీ ఎమ్మెల్యే భవానీ

యథేచ్ఛగా ఆర్థిక అక్రమాలు..

జగజ్జనని చిట్ ఫండ్స్ కంపెనీ కొన్నేళ్లుగా ఇష్టారాజ్యంగా అక్రమాలకు పాల్పడుతున్నట్టు సీఐడీ తనిఖీల్లో బట్టబయలైంది. ఆ కంపెనీ ఎండీ, డైరెక్టర్లు నిబంధనలకు విరుద్ధంగా చందాదారుల సొమ్మును మళ్లించి సొంత ఆస్తులు భారీగా కూడబెట్టుకున్నట్లుగా ఆధారాలను గుర్తించారు.

- చిట్‌ఫండ్స్ కంపెనీలు ఇతర వ్యాపారాలు చేయడం చిట్‌ఫండ్ చట్టానికి విరుద్ధం. కానీ, జగజ్జనని సంస్థ మాత్రం నిబంధనలకు విరుద్ధంగా అక్రమ డిపాజిట్ల సేకరణ, అక్రమంగా రుణాలు మంజూరు చేస్తూ వడ్డీ వ్యాపారం నిర్వహిస్తోంది. 2018 నుంచి 2023 వరకు భారీగా అక్రమ డిపాజిట్లు వసూలు చేసినట్లు.. వాటిపై వడ్డీలు చెల్లించినట్లు గణాంకాలతో సహా వెల్లడైంది. అదే రీతిలో చందాదారుల సొమ్ముతో భారీగా వడ్డీ వ్యాపారం చేస్తున్నట్లు గుర్తించారు. తద్వారా భారీ ఆదాయాన్ని ఆర్జించినట్లు వెల్లడైంది.
- చిట్టీల వేలం సొమ్ము చెల్లింపు ముసుగులో జగజ్జనని చిట్‌ఫండ్స్ నల్లధనాన్ని చెలామణిలోకి తెస్తోంది. 49 చిట్టీ పాటల ప్రైజ్‌మనీ మొత్తం రూ.11,76,82,000 చెల్లింపులను పరిశీలించారు. వాటిలో 21 చిట్టీ పాటల ప్రైజ్‌మనీ రూ.4,68,45,753ను బ్యాంకు ఖాతాల్లో జమచేశారు. మిగిలిన 28 చిట్టీల వేలం పాటల ప్రైజ్‌మనీ రూ.7,08,36,247ను నగదు రూపంలో చెల్లించినట్లు చెప్పారు. నగదు రూపంలో చెల్లించడం నిబంధనలకు విరుద్ధం. అంటే.. నల్లధనాన్ని చెలామణిలోకి తెచ్చినట్లు వెల్లడైంది.
- చిట్‌ఫండ్ కంపెనీ అన్ని వ్యవహారాలు నగదులోనే నిర్వహిస్తోంది. అంటే చందాల వసూళ్లు, చిట్ పాట మొత్తం చెల్లింపులన్నీ నగదులోనే నిర్వహిస్తోంది. ఇది ఆదాయపన్ను చట్టానికి విరుద్ధం. బ్యాంకు ఖాతాల్లో సంస్థ భారీగా నగదు డిపాజిట్లు కూడా చేస్తోంది. చిట్ వసూళ్లతో ఆ డిపాజిట్లు సరిపోలడంలేదు. ఎక్కువగా బ్యాంకు డిపాజిట్లు నగదు రూపంలోనే చేస్తున్నారు. చందా చెల్లించడంలేదని చెబుతున్న చిట్‌ల కోసం ప్రత్యేకంగా బ్యాంకు ఖాతా నిర్వహించడంలేదు.

శ్రీకనకదుర్గమ్మతల్లికి విశేష పూజలు


ఆలయం వద్ద భక్తుల సందడి

పాల్వంచరూరల్: శ్రీకనకదుర్గమ్మ తల్లికి అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. అభిషేకం జరిపారు. ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. తలనీలాలు, ఒడిబియ్యం, చీరలు, కుంకుమ, పసుపు, గాజులు అమ్మవారికి సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ చైర్మన్ మహిపతి రామలింగం, డైరెక్టర్లు భక్తులకు పులిహోర, ప్రసాదం వితరణ చేశారు.

అమ్మవారి సేవలో న్యాయమూర్తి

పెద్దమ్మతల్లి అమ్మవారిని ఆదివారం న్యాయమూర్తి దీప దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు అమ్మవారి శేషవస్త్ర ప్రసాదాలను న్యాయమూర్తికి అందజేశారు.

శివాలయ నిర్మాణానికి ఈ–టెండర్

పాల్వంచరూరల్: పాల్వంచ మండలంలోని కేశవాపురం – జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువై ఉన్న పెద్దమ్మతల్లి అమ్మవారి ఆలయం వద్ద నూతనంగా నిర్మించే శివాలయ పనులకు ఈ ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు ఈఓ ఎన్.రజినీకుమారి తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన చేశారు. శివాలయ నిర్మాణానికి రూ.34 లక్షల అంచనా వ్యయంతో టెండర్ కోరుతున్నామని పేర్కొన్నారు. వివరాలకు ఆలయంలోని తమ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

రామయ్య సన్నిధిలో ఏపీ ఐపీఎస్ అధికారి


ఆలయంలో కేవీ మహేశ్వరరెడ్డి తదితరులు

భద్రాచలం: శ్రీసీతారామ చంద్రస్వామి వారిని ఏపీలోని రంపచోడవరం ఓఎస్డీగా పనిచేస్తున్న ఐపీఎస్ అధికారి కేవీ మహేశ్వరరెడ్డి ఆదివారం దర్శించుకున్నారు. అంతరాలయంలోని మూలమూర్తులను దర్శించుకొని ఉపాలయాలలో ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు ఆశీర్వచనం అందచేసి స్వామి వారి తీర్థ ప్రసాదాలను, జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ఎల్.సాయిబాబా, వేగ్నేష ట్రస్టు బాధ్యులు శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

పరిహారంపై స్పష్టతేది..?

- నోరు మెదపని సింగరేణి, రెవెన్యూ అధికారులు
- మరోవైపు జేకే ఓసీ విస్తరణతోనే ఇల్లెందు మనుగడ
- మూడు రోజుల క్రితం ప్రజాభిప్రాయ సేకరణ సభ
- ప్రభావిత ప్రాంత ప్రజల్లో తీవ్ర ఆందోళనలు


అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లుకు వినతి పత్రం అందజేస్తున్న బాధితులు(ఫైల్)

ఇల్లెందు: జేకే ఓసీ విస్తరణలో పరిహారం చెల్లింపుపై స్పష్టత లేకపోవడంతో ప్రభావిత ప్రాంతాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఓసీ ఏర్పాటుపై రెండు రోజుల క్రితం సింగరేణి సంస్థ ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించగా, కనీసం తమ గోడు చెప్పుకునే అవకాశం ఇవ్వలేదని నష్టపోతున్న ప్రజలు, ఆయా ప్రాంతాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వార్డు సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇల్లు, పంట భూములకు పరిహారం మాటే ఎత్తకుండా ప్రజాభిప్రాయ సేకరణ జరిపారని ఆరోపిస్తున్నారు. వందల ఏళ్లుగా నివాసం ఉంటున్న తమకు ఏ రీతిన పరిహారం ఇస్తారో చెప్పలేదని పేర్కొంటున్నారు.

ఆగమేఘాల మీద ప్రజాభిప్రాయ సేకరణ..

సింగరేణి పుట్టినిల్లైన ఇల్లెందులో భూగర్భ గనులు మూతపడ్డాయి. ఒకే ఓసీ జేకే-5లో ఉత్పత్తి అడుగంటింది. ఇల్లెందు మనుగడ నూతన ఓసీతోనే సాధ్యమని, ఆగమేఘాల మీద ప్రజాభిప్రాయ సేకరణ జరిపారని, ప్రజామోదం పొందాలన్నట్లు సభ సాగిందని, నష్టపోతున్న ప్రజలకు పరిహారం అందించే అనుమానాలు నివృత్తి చేయలేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. కాగా ప్రజాభిప్రాయం మేరకే జేకే ఓసీ ఏర్పాటవుతుందని, అభిప్రాయాలను సేకరించి నివేదిక రూపంలో అనుమతి కోసం అందజేస్తామని అదనపు కలెక్టర్ కె.వెంకటేశ్వర్లు స్పష్టం చేసినా.. ప్రజల్లో నెలకొన్న ఆందోళన మాత్రం తొలగిపోవడంలేదు.

రూ.297 కోట్లతో 1,114 హెక్టార్లలో..

రూ.297.88 కోట్లతో 1,114.507 హెక్టార్ల భూమిలో జేకే ఓసీ విస్తరించనున్నారు. 99.12 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు ఉండగా, 68.57 మిలియన్ టన్నులు వెలికితీసే అవకాశం ఉన్నది. ఇందులో అటవీభూమి 213 హెక్టార్లు కాగా, అటవీయేతర భూమి 901 హెక్టార్లు ఉంది. ఓసీ జీవితకాలం 12 ఏళ్లు కాగా 30 నుంచి 190 మీటర్ల లోతు వరకు తవ్వకాలు జరపొచ్చని అంచనా. జీ-13 గ్రేడ్ బొగ్గు ఉన్నట్లు సింగరేణి అధికారులు గుర్తించారు. సాలీనా 2.50 మిలియన్ టన్నులు గరిష్ఠంగా 3.75 మిలియన్ టన్నుల వరకు ఉత్పత్తి చేయనుండగా, 657 మంది ఉద్యోగులు ఈ ఓసీలో పని చేయనున్నారు. ఇదే ప్రాంతంలో గతంలో 21 ఇంక్లైన్ భూగర్భగని మూతపడింది. కాగా భద్రాద్రి జిల్లా ఇల్లెందు మండలంలో రొంపేడు, సుదిమళ్ల, ఖమ్మం జిల్లా సింగరేణి మండలం ఉసిరికాయలపల్లిలో జేకే ఓసీ విస్తరించి ఉండనుంది. 2023–24 ఆర్థిక సంవత్సరంలో ఓసీని ప్రారంభించేందుకు సింగరేణి సంస్థ ఏర్పాట్లు చేస్తోంది.

జేకే–5 తరహాలోనే పరిహారం ఇవ్వాలి..

జేకే–5 ఓసీ విస్తరణ జరిగినప్పుడు కూడా పట్టణంలో 18,19,20 వార్డుల ప్రజలు నష్టపోయారు. నిర్వాసితులను ఆర్‌అండ్ఆర్ కాలనీకి తరలించారు. 1,400 మందికి పైగా పరిహారం అందజేశారు. ఇంటి స్థలాలు కేటాయించారు. భూములు కోల్పోయిన గిరిజనులకు ఉద్యోగాలు ఇచ్చారు. అయితే నేటికీ కొందరికి పరిహారం అందలేదని, పంపిణీలో గోల్‌మాల్ జరిగిందనే ఆరోపణలు ఉన్నాయి. జేకే-5 ఓసీ నిర్వాసితులకు పరిహారం ఇచ్చిన తరహాలోనే తమకు పరిహారం చెల్లించాలని జేకే ఓసీ విస్తరణ బాధితులు కోరుతున్నారు. ఓసీ ఏర్పాటుతో విజయలక్ష్మీనగర్ గ్రామపంచాయతీ తీవ్రంగా నష్టపోనుంది. ఇక్కడ సుమారు 120 కుటుంబాల వరకు నష్టపోయే ప్రమాదం ఉంది. పరిహారం చెల్లింపుపై ఇప్పటివరకు సింగరేణి, రెవెన్యూ అధికారులు స్పష్టత ఇవ్వకపోవడంతో ప్రభావిత ప్రాంత ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. న్యాయం కోసం పోరుబాట పట్టేందుకు సిద్ధమవుతున్నారు.

బాధితులను ఆదుకోవాలి



గతంలో జేకే-5 ఓసీలో నష్టపోయిన వారికి ఇప్పటికీ పరిహారం అందలేదు. ఈసారి అలా జరగకూడదు. 21 ఏరియాలో ఉంటున్న 200 మందితోపాటు సింగరేణి క్వార్టర్స్‌లో ఉంటున్న వారికీ పరిహారం చెల్లించాలి. వారి నివాస స్థలాలను సింగరేణి రెవెన్యూశాఖకు అప్పగించాలి. ఓసీని ప్రైవేట్‌పరం చేయొద్దు.

–ఎస్.రంగనాథ్, టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు

ప్రైవేటీకరణ తగదు



జేకేఓసీని సింగరేణి సంస్థ ప్రైవేట్‌పరం చేయాలనే ఆలోచన విరమించుకోవాలి. పూసపల్లి, రొంపేడు, కుమ్మరి బస్తీ, తిలక్ నగర్, విజయలక్ష్మీనగర్, 24 ఏరియా, సీఎస్‌పీ బస్తీ ఓసీకి 150 మీటర్ల దూరంలో ఉన్న ఇళ్లవారిని కూడా ఆదుకోవాలి. బ్లాస్టింగ్ ఆపరేషన్ లేకుండా నూతన టెక్నాలజీతో బొగ్గు వెలికి తీయాలి.

– కె. సారయ్య, ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి

అన్యాయం చేయొద్దు



దశాబ్దాలుగా సింగరేణితో బంధం ఉండి ఇక్కడే బతుకుతున్నాం. బొగ్గు తవ్వకాల కోసం జేకే ఓసీ ఏర్పాటు చేయాలని యాజమాన్యం నిర్ణయించింది. ఈ ప్రాంత ప్రజలందరం నిర్వాసితులమే. ఓసీ ఏర్పాటును మేం వ్యతిరేకించడం లేదు. నిర్వాసితులకు న్యాయం జరిగేలా పరిహారం ఇచ్చి ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

– పూనెం సురేందర్, ఎంపీటీసీ, విజయలక్ష్మీనగర్

పరిహారం తేల్చాలి



విజయలక్ష్మీనగర్ పంచాయతీలో కుమ్మరిబస్తీ ప్రజలు సర్వం కోల్పోనున్నారు. ఇల్లెందులో సింగరేణి ఉండాలంటే మేము నష్టపోవాల్సి వస్తోంది. అయితే అందరూ మాకు అండగా ఉండాలి. పరిహారం విషయం ముందు తేల్చాలి. ఏ ఒక్కరికీ అన్యాయం జరగకుండా చూడాలి.

– ధనసరి స్రవంతి, సర్పంచ్, తిలక్‌నగర్ పంచాయతీ

శరవేగంగా 'సీతారామ'!

చకచకా కాల్వ నిర్మాణ పనులు

కూసుమంచి: ఖమ్మం జిల్లా కూసుమంచి మండలంలోని పాలేరు రిజర్వాయర్‌కు గోదావరి జలాలను తరలించి.. ఆపై ఉమ్మడి ఖమ్మం, నల్లగొండ జిల్లాల ఆయకట్టుకు నీరు ఇవ్వాలనే ఉద్దేశంతో సీతారామ ఎత్తిపోతల పథకం చేపట్టారు. ఇందులో భాగంగా ప్రస్తుతం కాల్వ నిర్మాణ పనులు కూసుమంచి మండలంలోని పోచారం గ్రామం వద్ద శరవేగంగా సాగుతున్నాయి. ఈ కాల్వ మహబూబాబాద్ జిల్లా నుండి పాలేరు నియోజకవర్గంలోని తిరుమలాయపాలెం, కూసుమంచి మండలాల మీదుగా పాలేరు రిజర్వాయర్‌కు చేరుతుంది. ఎత్తిపోతల పథకం 16వ ప్యాకేజీలో భాగంగా ఈ పనులు సాగుతుండగా కాల్వ ఇప్పుడిప్పుడే ఓ రూపునకు వస్తోంది. ఇక తిరుమలాయపాలెం, కూసుమంచి మండలాల్లో చేపట్టే అండర్ టన్నెల్ మినహా కాల్వ పనులు మాత్రం చకచకా సాగుతున్నాయి. 350 మీటర్ల మేర వెడల్పుతో కాల్వ నిర్మాణానికి భారీ యంత్రాలతో పెద్ద పెద్ద గుట్టలను నేలమట్టం చేస్తున్నారు.


పోచారం వద్ద గుట్టలను తొలగిస్తున్న యంత్రాలు

ప్రశాంతంగా బీసీ గురుకుల ప్రవేశ పరీక్ష

ఖమ్మంమయూరిసెంటర్/కొత్తగూడెం అర్బన్ : బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని గురుకులాల్లో 2023 – 24 విద్యా సంవత్సరంలో ఇంటర్, డిగ్రీ ప్రవేశాల కోసం ఆదివారం నిర్వహించిన పరీక్ష ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ప్రశాంతంగా ముగిసింది. ఇంటర్ ప్రవేశాల కోసం ఉమ్మడి జిల్లాలో 3,629 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో ఖమ్మం జిల్లాలో 2,872 మంది, భద్రాద్రికొత్తగూడెం జిల్లాలో 757 మంది ఉన్నారు. ఖమ్మం జిల్లాలో 12 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయగా, 2,558 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. 314 మంది గైర్హాజరయ్యారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 2 కేంద్రాలను ఏర్పాటు చేయగా 626 మంది విద్యార్థులు హాజరయ్యారు. 131 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. బీసీ గురుకులాల్లో డిగ్రీ ప్రవేశాల కోసం ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 524 మంది దరఖాస్తు చేసుకోగా, వీరిలో ఖమ్మం జిల్లాలో 399 మంది, భద్రాద్రి కొత్తూగూడెం జిల్లాలో 125 మంది ఉన్నారు. ఖమ్మం జిల్లాలో 2 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయగా 339 మంది హాజరయ్యారు. 60 మంది గైర్హాజరయ్యారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 2 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయగా 105 మంది విద్యార్థులు హాజరయ్యారు. 20 మంది గైర్హాజరయ్యారు. ఉమ్మడిజిల్లావ్యాప్తంగా ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని ఆర్సీఓ జ్యోతి, భద్రాద్రి జిల్లా కన్వీనర్ వి.వి.కృష్ణవేణి తెలిపారు.


పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్సీఓ జ్యోతి

తపాలా ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

ఎన్‌యూపీఈ మహాసభలో సంఘం రాష్ట్ర నేత శివాజీ

ఖమ్మంగాంధీచౌక్: తపాలా ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో నేషనల్ యూనియన్ ఆఫ్ పోస్టల్ ఎంప్లాయిస్(ఎన్‌యూపీఈ) ముందుంటుందని ఎఫ్ఎన్‌పీవో సెక్రటరీ జనరల్ వాసిరెడ్డి శివాజీ అన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా ఎన్‌యూపీఈ గ్రూప్ సీ, పోస్ట్‌మెన్, ఎంటీఎస్, గ్రామీణ డాక్ సేవ క్స్ మహాసభ ఖమ్మంలో ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన శివాజీ మాట్లాడుతూ.. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో యూనియన్ బలంగా ఉందని, ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో తమ సంఘం చిత్తశుద్ధితో పనిచేయడమే ఇందుకు కారణమని అన్నారు. సమావేశంలో యూనియన్ కరీంనగర్ ప్రతినిధి వై.వెంకటేశ్వర్లు, ఐపీ/ఏఎస్‌పీ అసోసియేషన్ కార్యదర్శి బి.శ్రీనివాస్, యూనియన్ ప్రతినిధులు ఎం. రాంకుమార్, బ్రహ్మేశ్వర సింగ్, జి. నాగేశ్వరరావు, ఎ.కృష్ణ, సీహెచ్ కోటేశ్వరరావు మాట్లాడారు.


మాట్లాడుతున్న వాసిరెడ్డి శివాజీ

నూతన కమిటీ ఎన్నిక..

ఆయా సంఘాల ప్రతినిధులు పమ్మి వెంకటేశ్వర్లు, సీహెచ్ఎస్‌వీబీ కుమార్, ఎండీ షకీల్ ఆధ్వర్యంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా ఎన్‌యూపీఈ నూతన కమిటీలను ఎన్నుకున్నారు. గ్రూప్ సీ అధ్యక్షుడిగా బి.వీరన్న, కార్యదర్శిగా బి.హుస్సేన్, కోశాధికారిగా డి.శైలజ, ఎన్‌యూజీడీఎస్, అధ్యక్షుడిగా ఎస్వీ రమణ, కార్యదర్శిగా ఎం.రాంప్రసాద్, కోశాధికారిగా వి.శ్రీనివాస్‌రావును ఎన్నుకున్నారు.